క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి ఎంఐఎం నేత



పట్నంబజారు: ఎంఐఎం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్‌ఖాదర్ వైఎస్సార్ సీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో పొన్నూరు నియోజకవర్గంలో ఎంఐఎం తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి, ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈమేరకు పార్టీలో చేరిన అబ్దుల్ ఖాదర్ ను ఎమ్మెల్యే కిలారి రోశయ్య కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . సీఎం వైఎస్ జగన్ సంక్షేమపాలనకు రోజురోజుకూ జనాదరణ పెరుగుతోందన్నారు. అందుకే పలు పార్టీల నాయకులు ఆకర్షితులవుతున్నారన్నారు.

ఆర్థరైటిస్ చికిత్సా విధానాలపై అవగాహన



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్థరైటిస్ చికిత్సా విధానాలపై అవగాహన అవసరమని జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. గురువారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ విద్యార్థులకు ఆర్థరైటిస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జువినైల్ ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఫీవర్, బ్రూసిల్లోస్పాండిలో, రుమటాయిడ్, ఓస్టియో ఆర్థరైటిస్ లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, సంభవించేందుకు గల కారణాలు, చికిత్సా విధానాలను వివరించారు. సమస్య ఏదైనప్పటికీ తొలిదశలో గుర్తిస్తే చికిత్స అందించడం సులభతరమవుతుందని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం, సమతుల్యమైన ఆహారంతో ఎటువంటి ఆర్థరైటిస్‌ను అయినా నయం చేయవచ్చునని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఫార్మా.డి డైరెక్టర్ పి. సీతారామయ్య, డాక్టర్ ఎన్. హేమకుమారి పాల్గొన్నారు.

రేపు శ్రీసాయి రాగ సంగీత కళాశాల వార్షికోత్సవం

నగరంపాలెం: శ్రీ సాయి రాగ సంగీత కళాశాల తృతీయ వార్షికోత్సవం ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మునిపల్లె రమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ లైటింగ్ వ్యాపార సంస్థ వి-లైట్స్ సౌజన్యంతో ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శిల్పారామంలో సాయంత్రం వేడుకలు ప్రారంభమవుతాయని, సంగీత ప్రియులు హాజరుకావాలని ఆమె పేర్కొన్నారు.

వ్యక్తి మృతి

పట్నంబజారు: మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. శివనాగరాజు కాలనీకి చెందిన షేక్ వలి(28) నిత్యం మద్యం తాగుతూ బానిసగా మారాడు. ఈక్రమంలో భగత్‌సింగ్ బొమ్మ సెంటర్ సమీపంలో గురువారం మృతిచెంది పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి ఖాదర్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మే1 నుంచి ఉచిత వేసవి శిక్షణా శిబిరం

తెనాలి: పట్టణానికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి ఆరంభించనున్నారు. అన్ని వయసుల బాలికలు, స్త్రీలు, 11 ఏళ్లలోపు బాలురకు మాత్రమే ఏర్పాటు చేస్తున్న ఈ శిక్షణ శిబిరం జూన్ 5వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల్నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కన్నెగంటి రామరాయచౌదరి ఒక ప్రకటనలో తెలియజేశారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల కొనసాగింపు కోసం ఈ శిబిరంలో యోగ, కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, చిత్రలేఖనం, సంస్కృతం, తెలుగులో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగలవారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

తెనాలి: శ్రీసరస్వతీ శిశుమందిర్ గ్రాడ్యుయేషన్ డే సంబరాలను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు శిశుమందిర్ సంచాలిత సమితి, పాఠశాల అభివృద్ధి కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశాయి. ఆరోజు సాయంత్రం 4 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటయ్యే సభకు సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహిస్తారు. గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కోడూరు రమాదేవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, శ్రీసరస్వతీ విద్యాపీఠం-విజయవాడ సమితి కార్యదర్శి కొసనం జగదీష్, పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు, కార్యదర్శి దూళ్ల నరసింహారావు పాల్గొంటారని వివరించారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, లేళ్ల అప్పిరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి నూరిఫాతిమా, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి, వెస్ట్ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పాలనను స్వాగతిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు అమానుల్లా ఖాన్, టిప్పర్ యాసిన్ తనయుడు జాకీర్ గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళిగిరిధర్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం సమక్షంలో నూరిఫాతిమా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నేతలు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కేలా చూస్తామన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వివరాల సేకరణకు నేడు ఆఖరు

నెహ్రూ నగర్: ఎన్నికల విధులలో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం చివరి రోజు అని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కె.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ని తొలుత ఈ నెల 22వ తేదీలోపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రస్తుతం 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం(94) పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు (వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు మొదలుగు వారు) వారి ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నప్పటికి, జీఎంసీలోని ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ వద్ద ఫారం-12 కు సంబంధించిన వివరాలు అందించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 26వ తేదీ శుక్రవారం లోగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్ లో ఫారం-12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం-12తో పాటు ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ సిబ్బంది కార్యాలయ పని వేళల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉంటారని వివరించారు.

జేఈఈ మెయిన్స్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కోర్ డీన్ శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్- 2024 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు సంస్థ అకడమిక్ ఇన్‌చార్జి తార్నాక చంద్రశేఖర్, డీజీఎం శ్రీనివాసరెడ్డి, కోర్ డీన్ వీరగంధం శ్రీనివాసరావు తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని కళాశాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అన్ని కేటగిరీల్లో బి.ధరణి 195 ర్యాంకుతో పాటు, బి.చైతన్య 405, ఎన్. శ్యామ్‌కుమార్ 473, జె.హర్షిత 514, ఏ అఖిల్ రాజేంద్రన్ 583, టి.మహాలక్ష్మి 596, కె.వెంకట సాయి పవన్ కుమార్ 736, కె.రోహిత్ 867, వి.సైనీ 939 వంటి వెయ్యి లోపు తొమ్మిది ర్యాంకులు సాధించామని తెలిపారు. రెండువేల లోపు 19, ఐదువేల లోపు 32, 10వేల లోపు 58 ర్యాంకులు సాధించామని వివరించారు. పటిష్టమైన ప్రణాళికతో అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజీఎం హనుమంతరావు, డీన్లు వల్లభరావు, ప్రిన్సిపాల్స్ రవికాంత్, వేద, రమాదేవి, జి.శ్రీనివాస్, సురేష్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాలని దర్గాలో ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ మొహిద్దీన్‌పాలెం దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రాష్ట్రంలో మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంత్రి విడదల రజిని తోడికోడలు విడదల స్ఫూర్తి, మొహిద్దీన్‌పాలెం దర్గా కమిటీ సభ్యులు హనీఫ్, సంధాని, జాకీర్‌మొహమ్మద్, ఫారూఖ్‌బాషా, సుభాని, ఖాజామొహిద్దీన్, షరీఫ్ పాల్గొన్నారు.

తెనాలిలో కొత్త సినిమా షూటింగ్



తెనాలి: శ్రీ కృష్ణ ఆర్ట్స్ పతాకంపై పట్టణానికి చెందిన దర్శకుడు కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో ఆరంభించిన నూతన సినిమా షూటింగ్ గురువారంతో తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తెనాలి, పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. ఎడ్యుకేషన్, సైన్స్, పురోగతి అనే అంశాలపై ప్రధానంగా సినిమా ఇతివృత్తం ఉంటుందని రత్నాకర్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో మరో రెండు షెడ్యూల్స్‌తో చిత్రీకరణ పూర్తవుతుందనీ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు అనంతరం నవంబరులో విడుదల చేస్తామన్నారు. కేజీఎఫ్ ఫేమ్ చైల్డ్ సూపర్ స్టార్ లిటిల్ భాను, మాస్టర్ పుష్కర్‌లు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, బెల్లంకొండ వెంకట్, గోమతి, మధుకర్, వసంత యామిని, రాధ, ఆలపర్తి వెంకటేశ్వరరావు, గురుబ్రహ్మం, అజయ్ ఇండియన్, లక్ష్మి, తులసి ఇతర పాత్రల్లో నటిస్తున్నారని తెలిపారు. సాధు సుస్మిత, కన్నెగంటి రవి, కె.ధీరజ్‌లు నిర్మాతలు కాగా సినిమాటోగ్రఫీ వరప్రసాద్‌రెడ్డి, ఆర్ట్ వెంకట్, అసోసియేట్ డైరెక్టర్ రమణ, స్టిల్స్ సీహెచ్ శేఖర్, ప్రొడక్షన్ మేనేజర్ మునిపల్లి శ్రీకాంత్‌గా వివరించారు.

రూ.2.50 లక్షల నగదు స్వాధీనం



కంతేరు రోడ్డు శ్రీ సిటీ వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో సదరు వ్యక్తులు

తాడికొండ: ఎన్నికల ప్రవర్తన నియామావళిలో భాగంగా ఎన్నికల అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనధికారికంగా తరలిస్తున్న రూ.2.50 లక్షల నగదును గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల మేరకు..ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. లాం గ్రామం సమీపంలో షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి ఎలాంటి రశీదులు లేకుండా కారులో లక్ష రూపాయలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. కంతేరు శ్రీసిటీ సమీపంలో తాడికొండ గ్రామానికి చెందిన తాడిబోయిన ప్రసాదు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రూ.1.50లక్షల నగదు తరలిస్తూ సరైన రశీదులు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తదుపరి విచారణ నిమిత్తం సంబంధిత నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

ఈఎస్ఐ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం



మాట్లాడుతున్న ఈఎస్ఐ అధికారి

తెనాలి: ఈఎస్ఐ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలో గల శ్రీ చైతన్య పాఠశాలలు, శ్రీ చైతన్య జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఈఎస్ఐ చందాదారులు, కుటుంబ సభ్యులకు నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు చేశారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. డాక్టర్ మాధవి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ ఫణిందర్ వైద్య పరీక్షలు చేశారు. అక్కడే అవగాహన సదస్సును జరిపి ఈఎస్ఐ స్కీము ద్వారా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య శిబిరానికి 300 పైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరైనట్టు శ్రీ చైతన్య పట్టణ ప్రిన్సిపాల్స్ బి.తిరుపతిరావు, నన్నపనేని సునీల్‌కుమార్ తెలిపారు. ఈఎస్ఐ సిబ్బంది పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం గురువారానికి మూడో రోజుకి చేరాయి. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కళా మండలం స్వర దీప మహంత, మోహినీ ఆట్టం, రాజీబ్ ఘోష్ (కోల్‌కత్తా), కథక్ (ఇందిరా పరాశరం హైదరాబాద్) కూచిపూడిల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం వారిని యువ కళారత్న పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల చైర్మన్ డాక్టర్ కేఎస్ఆర్ గోపాలన్, డాక్టర్ చైతన్య, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం, కార్యక్రమాల కార్యదర్శి వెంకటగిరి నాగలక్ష్మి, పతకమూరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

విద్యతోనే మహిళల పురోగతి

ఫిరంగిపురం: విద్యద్వారానే మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించవచ్చని సెయింట్ ఆన్స్ పాఠశాల హెచ్ఎం సిస్టర్ ఒట్టి వసంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 500 మార్కులు దాటిన తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 30 మంది ఉన్నారని తెలిపారు. వారిలో డి.కృపారాణి, సుహాస, రమ్యశ్రీ నవ్య, సుకన్య, మరియకీర్తి, రఫియా, లక్ష్మీసుకన్య, శ్రావణి, కీర్తన, నమితారెడ్డి, యామిని, అరుణకుమారి, లక్ష్మి, బ్యూలా, శాంతి, మహాలక్ష్మీదుర్గ, వెళాంగిణిజ్యోతి, పి.శాంతి, ఏంజల్, కరిష్మ, అంజనాదేవి.అనిత, దివ్య, కీర్తనామృత, ప్రసన్నకుమారి, చైతన్య, భార్గవి, రుక్సానా, నోషిన్, త్రివేణిలు ఉన్నారని చెప్పారు. వారిని అభినందించారు.

వసతిగృహంలో సెల్‌ఫోన్లు చోరీ

మంగళగిరి: గుర్తు తెలియని వ్యక్తి వసతి గృహంలోకి ప్రవేశించి సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన ఘటన గురువారం ఆత్మకూరులో చోటు చేసుకుంది. బాధితులు మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై క్రాంతి కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... ఎల్‌బీ నగర్(ఆత్మకూరు) ఏపీఎస్‌పీ బెటాలియన్ సమీపంలోని కొప్పోల్ల పీజీ హాస్టల్‌లో స్థానికంగా వివిధ కళాశాలల్లో చదువులు సాగిస్తున్న విద్యార్థులతో పాటు పలువురు ఉద్యోగులు పేయింగ్ గెస్టులుగా ఉంటున్నారు. గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి వసతి గృహంలోకి ప్రవేశించి గదుల్లో నిద్రిస్తున్న వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లు అపహరించుకుపోయాడు. వసతి గృహం నిర్వాహకులు సీసీ ఫుటేజీల ద్వారా ఆగంతకుడిని కనుగొని మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుంటూరులో షర్మిల ఎన్నికల ప్రచారం

లక్ష్మీపురం: ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గురువారం రాత్రి గుంటూరు చుట్టుగుంట నుంచి శారదా కాలనీ మీదుగా, సంజీవయ్యనగర్‌లో పర్యటించారు. బహిరంగ సభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ స్టాక్ దగ్ధం



గుంటూరు రూరల్: నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం ఏర్పాటు చేసేందుకు ఉంచిన వాటర్ పైపులు మంటల్లో దగ్ధమయ్యాయి. నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో ఖాళీ ప్లాట్లలో షాపూజీ పల్లంజీ సంస్థకు చెందిన ప్లాస్టిర్ వాటర్ పైప్‌లు స్టాక్‌ను గత కొన్నేళ్లుగా అక్కడే ఉంచారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఘటనపై నల్లపాడు పోలీసులు ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

నామినేషన్ల వివరాలను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు



నామినేషన్ల వివరాలను ఎలక్షన్ అబ్జర్వర్ ఎస్పీ కార్తీకకు వివరిస్తున్న తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఎన్నికల అబ్జర్వర్ ఎస్పీ కార్తీక గురువారం గుంటూరు తూర్పు (95) రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను, గురువారం అందిన నామినేషన్ల వివరాలను తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరిని అడిగి తెలుసుకున్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు 29 మంది అభ్యర్థులు 43సెట్లు వేసినట్లు వివరించారు. తూర్పు నియోజకవర్గంలోని ఓటర్ల సంఖ్య, పోలింగ్ కేంద్రాల సంఖ్య, సమస్యాత్మక కేంద్రాల వివరాల గురించి కీర్తి చేకూరి అబ్జర్వర్‌కు వివరించారు.

తూర్పులో 43 నామినేషన్లు

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో నామినేష్ల గడువు ముగిసే నాటికి మొత్తం 43 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ల స్వీకరణ తేదీ 18వ తేదీ నుంచి చివరి రోజు గురువారం వరకు నామినేషన్లు స్వీకరించినట్లు చెప్పారు. చివరి రోజు 11 మంది 13 సెట్ల నామినేషన్లు దాఖలు చేసినట్లు చెప్పారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. ఈ నెల 29 నామినేషన్ల ఉపసంహరణ తుది గడువుగా పేర్కొన్నారు. అనంతరం తుది జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.

మలేరియా మహమ్మారి నిర్మూలనే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: 2030 నాటికి భారతదేశంలో మలేరియాను నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా తెనాలి సబ్ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. దీనిని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియాను నిర్మూలించడంలో ప్రజాభాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. నీటి నిల్వల్లో దోమలు గ్రుడ్లు పెట్టి తమ సంతతిని పెంచుకుంటున్నాయని వాటివల్లే వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాల్వల్లో పారుదల సక్రమంగా జరిగితే కొంత వరకు దోమలు నియంత్రించవచ్చన్నారు. దోమల నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలు వాడటం, వస్త్రాలను పూర్తిగా ధరించడం వంటి వాటిని చేయాలన్నారు. ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల మాట్లాడుతూ విపరీతమైన జ్వరం, చలి, చమటలు పట్టుట, తలనొప్పి, వికారం మొదలైనవి మలేరియా లక్షణాలని తెలిపారు. అలాంటివి కనిపిస్తే వెంటనే వైద్యశాలను సంప్రదించాలన్నారు. సకాలంలో మలేరియాను గుర్తిస్తే చికిత్స సులువు అన్నారు. సహాయ మలేరియా అధికారి చరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2008లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ బీబీజాన్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకంత్, డీపీఎం శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ఫిరంగిపురం: పోషకాహారంతోనే ఆరోగ్యం చేకూరుతుందని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు, షుగర్, బీపీ, థైరాయిడ్ ఉన్న రోగులు 182 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత మాట్లాడుతూ వేసవిలో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ ఏఎన్ఎం మాబు, బాబురావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థినులకు అభినందన

తెనాలి: జేఈఈ మెయిన్స్‌లో స్థానిక వివేక విద్యాసంస్థల విద్యార్థులు 24 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించినట్టు డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ వెల్లడించారు. వీరిలో అయిదుగురు 90 పర్సంటైల్ పైగా సాధించి కేంద్ర ప్రభుత్వ ఎన్ఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు అవకాశం పొందినట్టు తెలిపారు. జనవరి, ఏప్రిల్‌లో రెండుసార్లు జరిగిన జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థి భార్గవ గతంలోనే 99.4 పర్సంటైల్ సాధించగా, ఈసారి బి.నాగ పూజిత 95.3 పర్సంటైల్, జయశ్రీ 93.2, జాహ్నవి 92, యశశ్రీ 90 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. జాతీయ స్థాయి పరీక్షల్లో మంచి పర్సంటైల్ సాధించిన సందర్భంగా విద్యార్థులను గురువారం క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. డాక్టర్ వీరనారాయణతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ కె.రామరాజు, గుత్తా వెంకటరత్నం, ప్రిన్సిపాల్స్ జ్యోతి, కేవీ బ్రహ్మం, సీఈవోలు ఉదయ్‌కిరణ్, వెంకట్రామ్, డీన్ ఎస్.శ్రీనివాస్, బాబూరావు, అనూరాధ, మురళి, రాంబాబు పాల్గొన్నారు.

కేఎల్పీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్‌లో కేఎల్‌పీ స్కూల్ ప్లస్ టూ విద్యార్థిని పి.నాగశ్రీషా 96.41 పర్సంటైల్ సాధించినట్లు డాక్టర్ కృష్ణప్రసాద్ తెలిపారు. జేఈఈ మెయిన్స్, నీట్, ఏపీ ఎంసెట్‌తో పాటు వివిధ వర్సిటీలు నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, ఏటి కె.వెంకట్రావు విద్యార్థినికి అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

చేబ్రోలు: మండల కేంద్రానికి చెందిన షేక్ నాగుల్ మీరా (53) అనే వ్యక్తి తెలంగాణలోని నల్గొండ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాదం అనంతరం వడ్లమూడిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అతనిని తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. నల్గొండ పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ విభాగంలో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

చలివేంద్రాన్ని వినియోగించుకోండి

తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని అంతా ఉపయోగించుకోవాలని దీప్తి పబ్లికేషన్ అధినేత అడ్డాల ఆంజనేయులు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ తెనాలివారి ఆధ్వర్యంలో బోసురోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి రోజు చల్లటి మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

వేసవికాలం ముగిసేవరకు చలివేంద్రం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మొవ్వా సత్యనారాయణ, జివి.నారాయణ, చాగంటి చంద్రశేఖర్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, కొఠారి ఛాతన్ రాజ్, వెంకటప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.